కథా నిలయం
3622
శ్రీకాకుళం

# 1. లంచాల దేవుడు

చెట్టుపైనున్న శవాన్ని భుజంపై వేసుకొని శ్మశానం దిక్కు నడుస్తున్నాడు రామ్మోహన్——మౌనంగా తన గమ్యం చేరుకునే ప్రయత్నంలో వడివడిగా అడుగులేస్తున్నాడు......అరిగిన చెప్పులు, పెరిగిన గడ్డం, మాసిన బట్టలు లోతుకు పోయిన కళ్ళు, ముఖంపై అలసట, జీవితంలో అతని ఓటమిని సూచిస్తున్నాయి — శవం బరువవుతున్నా భరిస్తూ పట్టుదలగా నడుస్తున్న రాంమ్మోహన్‌తో శవంలోని భేతాళుడు

"ఓ మనిషీ! నీ ఆకారాన్నిబట్టి చూస్తే నువ్వు జీవితంలో చాలా విషయాల్లో ఓడిపోయిన వాడిలా కనబడుతున్నావు ఆ ఊహే నిజమయితే నువ్వో నిరుద్యోగివి —అవునా...?" అని ఆగాడు—

తనకు మౌనభంగమైతే శవం మాయమవుతుందని ఏం మాట్లాడలేదు రామ్మోహన్.

"అవును నేను నిరుద్యోగినే....డిగ్రీ ఫస్టుక్లాసులో పాసయ్యాను ఎనిమిదేళ్ళుగా ఆఫీసు చుట్టూ కాళ్ళ చెప్పులేకాదు, కాళ్ళరిగేలా తిరుగుతున్నాను.. ....అన్ని ఇంటర్వ్యూలు బాగానే చేస్తున్నాను — అయినా ఉద్యోగం దొరకడంలేదు —ఉద్యోగం సాధించడం కన్నా భేతాళున్ని సాధించడమే సులభమని ఈ ప్రయత్నం చేస్తున్నాను

తనలో తాననుకొన్నాడు రామ్మోహన్ — మౌనంగా శ్మశానం కేసి గబగబా నడుస్తున్నాడు—.

"ఓ మానవుడా! నీ ప్రయత్నం నాకు తెలుసు... నన్ను పొందడంలో నువ్వు విజయం సాధిస్తే నీకు తప్పక స్వాధీనమవుతాను — —

నీకు మార్గాయాసం కలుగకుండా ఉండడానికో కథ చెబుతాను విను—''
అని కథ చెప్పడం ప్రారంభించాడు భేతాళుడు.

రాజారావు గొప్ప ధనవంతుడు— కోట్ల ఆస్తికి యజమాని — తరతరాలు కూర్చొండితిన్న తరగనంత డబ్బున్నా ఇంకా సంపాదిస్తూనే వున్నాడు — అతని సంపాదనకు మూలకారణం వడ్డీ వ్యాపారమే — ఆస్తులు జప్తులుచేస్తూ, చక్రవడ్డీలు కడుతూ బాకీలు నిర్దాక్షిణ్యంగావసూలు చేస్తూంటాడు.—

రాజారావు మాదండి దైవభక్తుడు— ప్రొద్దున్నే రెండు గంటలు పరమనిష్ఠతో పూజగదిలో గడుపుతాడు పూజ ముగియందే పచ్చి మంచి నీళ్ళు కూడా నోట్లోపోసుకోడు తనకున్న దైవభక్తికి నిదర్శమన్నట్టుగా అతడో గుడి కట్టించాడు - నిత్య ధూప దీప నైవేద్యాలతో ఖర్చునతడే భరిస్తున్నాడు.—తన దైవభక్తే అభివృద్ధికి కారణమంటాడతను

వ్యాపార విషయంలో ఇపపుడతనికో చిన్న సమస్యేదురైంది. . నాలుగేళ్ళ క్రితమో పేద రైతుకు నాలుగువేల రూపాయలు అప్పిచ్చాడు. రాజారావు— మూడేళ్ళ క్రితమా పేదరైతు మూడువేల అప్పు తీర్చాడు అయితే రాజారావుపైన నమ్మకంతో ఆ అప్పు తీర్చినట్టు కాగితంపై రాయించుకోలేదు ఆ మూడువేలు తీర్చినట్టు రైతుకే ఆధారమూలేదు

ఈ పాయింటు నాధారం చేసుకొని మొత్తం అప్పు తీర్చాలంటున్నాడు రాజారావు— లబలబ మొత్తుకున్నాడు రైతు .... విషయం నలుగుర్లొ పడింది — ఇది పైకి అన్యాయంగానే కనిపిస్తున్న వ్యాపారంలో ఇవి మామూలేనని తనకు తాను సర్దిచెప్పుకున్నాడు రాజారావు — ఆ రోజె పంచాయతీ—

ఆరోజు దైవప్రార్థనకు మూడుగంటలు కేటాయించాడు— రైతు నుండి తాను మొత్తం అప్పు వసూలు చేయగలిగితే వెయ్యి రూపాయలు ఖర్చుచేసి గుడిముందు సిమెంటుగద్దె కట్టిస్తానని మొక్కాడు — గుళ్ళో గంట కడతానన్నాడు — సహస్రనామార్చన చేయిస్తానని, పులిహోర నైవేద్యం పెడతానని సాగిలపడి మొక్కాడు —పూజ ముగించి పంచాయతీ ఆఫీసుదిక్కు నడిచాడు

పేదరైతు కూడా దేవుణ్ని పరిపరి విధాల ప్రార్థించాడు- తీర్చిన బాకీ తన మీద పడనివ్వకుమని వేడుకున్నాడు —ఈ గండం గట్టెక్కితే దేవునికి కొబ్బరికాయ కొడుతానని మొక్కుకొని పంచాయతీ ఆఫీసు దగ్గరికెళ్ళాడు—

ఇద్దరి ప్రార్థనలు విన్నాడు, దేవుడు- అటు ధనవంతుడు ఇటు పేదవాడు – పేదవాడి పక్షాన న్యాయముంది కాని, ఋజువులు ధనవంతుని పక్షాన వున్నాయి – ఇద్దరూ తన భక్తులే – చిరునవ్వు నవ్వుకున్నాడు దేవుడు.

పంచాయతీ అయిపోయింది – తీర్పుబయటకొచ్చింది. దేవుడు ఎవరి పక్షాన నిలచాడు? దేవుడలా ఎందుకు చేసాడు !

నీకున్న జీవితానుభవాలతో సమాధానాలు చెప్పు–? నీకు తెలిసిందే చెప్పు చెప్పకుంటే నీ తల వెయ్యివక్కలుకాదు గాని నువ్వు జీవితాంతం నిరుద్యోగిగానే వుంటావు— అని అగాడు భేతాళుడు—

ఆ ప్రశ్నలకు సమాధానాలు చెప్పసాగాడు రామ్మోహన్.

ఆ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి పెద్దగా జీవితానుభవం అవసరం లేదు _ దేవుడు న్యాయపక్షపాతి – రైతుదిక్కు న్యాయముంది కాబట్టి రైతు కనుకూలంగానే తీర్పు వచ్చేట్టు చేస్తాడు దేవుడు—"

ఆ మాటలు విని బిగ్గరగా నవ్వాడు భేతాళుడు — "మానవుడా నీకు పుస్తక జ్ఞానమే తప్ప లోకజ్ఞానం శూన్యమని నీ సమాధానాలను బట్టి తెలుస్తుంది _ రైతుకు సాయంచేస్తే దేవుడి కొరిగేదేంటి–? కొన్ని చెంబాల కొబ్బరినీళ్ళు _ అదే రాజారావు దిక్కు నిలబడితే సిమెంటు గద్దెలు, సహస్రనామార్చన, పులిహోర నైవేద్యం–ఇంకెన్నో ఇవన్ని వదులుకొని దేవుడైతే మాత్రం రైతుకెలా సాయం చేస్తాడు–? ప్రతిభ వున్నా లౌక్యం తెలియకపోవడంవల్ల నువ్వు ఉద్యోగం సంపాదించుకో లేకపోతున్నావు–

నీ కుద్యోగం దొరకాలంటే ఏంచెయ్యాలో నీ కిప్పుడర్ధమైందను కుంటాను – విష్‌యూ బెస్ట్ ఆఫ్ లక్_" అని "నీకు మౌనభంగం జరిగింది కాబట్టి అంతర్ధానమవుతున్నాను" అని శవంతో సహ మాయమై చెట్టుపైకెళ్ళాడు భేతాళుడు –

[రా.వి. శాస్త్రిగారి "కొండగల దేముడు" చదివిన ప్రేరణతో– జీవగడ్డ సాయంత్రం దిన పత్రిక 17–11–1985 ఆదివారం]